చోడవరంలో కుండపోత వర్షం

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరంలో గురువారం ఉదయం నుండి కుండపోత వర్షం కురుస్తోంది. వర్షం కారణంగా జన జీవనం స్తంభించిపోయింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రయాణీకులు నానా ఇబ్బందులతో తడిసి ముద్దయి గమ్యం చేరుకున్నారు. రెండురోజులుగా వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, వర్షం పడకపోవడంతో ప్రజలు అప్రమత్తంగా వున్నారు. వరి చేలు పొట్ట దశలో వుండడంతో, భారీ వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎగువ వర్షాలు కారణంగా గెడ్డలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. చోడవరం పరిసరాల్లోని కోనాం, రైవాడ, పెద్దేరు, లక్ష్మీపురం రిజర్వాయర్లు ప్రమాద స్థితికి చేరుకున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

జిల్లా వైసీపీకి గ్రహణ విముక్తి

- నూతన అధ్యక్షునిగా బూడి ముత్యాలనాయుడు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లా వైసీపీ పార్టీకి గ్రహణ విముక్తి కలిగింది. కొన్ని సంవత్సరాలుగా జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ ప్రతిష్ఠను దిగాజార్చిన వ్యక్తిని ఇప్పుడు ఆ బాధ్యతల నుంచి తప్పించి నూతన అధ్యక్షుడిగా మాజీ డిప్యూటి సిఎం బూడి ముత్యాల నాయుడును ఎంపిక చేయడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్య క్షుదు జగన్‌మోహ్మన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో అనకాపల్లి, అల్లూరి, విశాఖ జిల్లా ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి అనకాపల్లి జిల్లాకు బూడి ముత్యాలనాయుడు, విశాఖ జిల్లాకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అల్లూరి జిల్లా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును అధ్యక్షులుగా నియమిస్తూ ప్రకటనలు విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా అనకాపల్లి జిల్లాకు ఇన్నాళ్లు అధ్యక్షుడిగా కొనసాగిన వ్యక్తి ఆ బాధ్యతను మరచి గ్రూపు రాజకీయాలకు పదనుపెట్టి పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేశాడనే ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఎన్నికల్లో, ఎన్నికల ముందు యలమంచిలి నియోజకవర్గంలో "బిపి" తెప్పించిన సంఘటలనపై ఇప్పటికి పార్టీ శ్రేణులు ఆగ్రహంగా ఉన్నాయంటే ఏ స్థాయిలో "బిపి" గ్రూపులు నడిపాడో అర్థం చేసుకోవచ్చు. జిల్లా అధ్యక్షునిగా సమస్యలను పరిష్కారించవలసింది పోయి తానే సమస్యలను, పుకార్లును సృష్టించి అటు యలమంచిలి, ఇటు అనకాపల్లి నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితులకు కారణంగా ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. అప్పటి ఎమ్మెల్యే వర్గంలోని కొంతమంది వ్యక్తులను ఆయనకు వ్యతిరేకంగా తయారు చేసి వారిలో వారే గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొనే విధంగా తెరవెనుక చక్రం తిప్పిన ఘనుడుగా ప్రస్తుత మాజీ అధ్యక్షున్ని చెప్పుకోవచ్చు అంటూ పార్టీ శ్రేణులు అంటున్నాయి. జిల్లా అధ్యక్షుని హోదాలో పార్టీని సర్వనాశం చేయడానికి శతవిధాల ప్రయత్నించిన ప్రస్తుత మాజీ అధ్యక్షుడుకి మాజీ మంత్రి, విశాఖ జిల్లా నూతన అధ్యక్షునిగా ఎంపికైన వ్యక్తి పూర్తి స్థాయిలో సహకరించి ప్రోత్సహించినట్లు కూడా పార్టీశ్రేణులు ఆరోపిస్తున్నాయి. యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో పార్టీని, క్యాడర్‌ను గందరగోళ స్థితికి తీసుకువెళ్లి గడిచిన ఎన్నికల్లో పూర్తి స్థాయిలో శ్రేణులు పనిచేయకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఎన్నికల ముందు, ఎన్నికల్లో రెండు వర్గాలుగా చీలిపోయి ఓటమే ప్రధాన అజెండాగా పనిచేసిన ఇరు వర్గాల కార్యకర్తలు ఓటమి తరువాత కలిసి పనిచేయడం విచిత్రంగా ఉంది. ఏదేమైనా అనకాపల్లి జిల్లాను ఇన్నాళ్లుగా పట్టిపీడిస్తున్న గ్రహణం నుంచి విముక్తి కలిగించి బూడి ముత్యాల నాయుడ్ని అధ్యక్షునిగా ఎంపిక చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

పశువైద్యశాలల పరిశీలన

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని చీడికాడ, ఖండివరం పశు వైద్యశాలలు, చుక్కపల్లి రైతు సేవా కేంద్రాన్ని పాడేరు డివిజన్ ఉపసంచాలకులు సిహెచ్ నరసింహులు తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పశు వైద్యశాలలో పాడి రైతులకు అందుతున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకమైన గోకుల షెడ్లు, పీకేసిసి లైన్లు, పశు బీమా, సార్టెడ్ సిమెన్ పథకాల గురించి రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల సహాయ సంచాలకులు చిట్టినాయుడు, పశు వైద్యులు గాయత్రీదేవి, గణేష్, సిబ్బంది సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొప్పిశెట్టి బుజ్జి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నక్కపల్లి: ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా యువ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో పార్టీ అభిమానులు యువకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా ఉపమాక గ్రామంలో నిర్వహించారు. బుజ్జి చేత మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. బుజ్జికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా, మండల పార్టీ నాయకులు గుర్రం రామకృష్ణ, అమలకంటి అబద్ధం, పెద్దిరెడ్డి శ్రీను, వెలగ శ్రీనివాసరావు, మెరుగు నాగేశ్వరరావు, ప్రగడ వీరబాబు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సివిల్ సప్లై కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివ దత్తు, పలువురు సర్పంచ్లు, ఎంపీటీసీలు, పార్టీ అభిమానులు, అల్లు మోహన్, జి.సత్తిబాబు, గొర్ల శ్రీను, తోలేటి శ్రీను, పిక్కి గంగరాజు, కోదండరావ్, కోదండ ఉన్నారు.

గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలో దిబ్బిడి గ్రామం వద్ద కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని తరలిస్తూ బుచ్చయ్యపేట పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేసి వారి వద్ద ఉన్న సుమారు 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

కొత్తపెంటలో పిడుగు పడి రైతు మృతి

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో కొత్త పెంట గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటల సమయంలో సూరెడ్డి అప్పలనాయుడు (36) అనే రైతు పిడుగు పడి మరణించాడు. అప్పలనాయుడుకి భార్య కుమారి, ఒక కుమారుడు వివేక్ ఉన్నారు. ఇతను బుధవారం ఉదయం పశువుల మేతకు పచ్చ గడ్డి కోసి తీసుకురావాటానికి పొలం లోకి వెళ్ళి గడ్డి మోపు మోసుకుని వస్తుండగా అతనిపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పశువుల మేత కోసం వెళ్ళిన తన భర్త మృతి చెందడంతో భార్య కుమారి, తల్లి పాలమ్మ బోరున విలపిస్తున్నారు.

సక్రమంగా వేతనాలు చెల్లించండి

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో సమగ్ర శిక్షణ అభియాన్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని జేఏసీ మండల యూనియన్ నాయకులు రామకృష్ణ, కార్యదర్శి చుక్కల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిబ్బందితో కలిసి ఆందోళన చేపట్టారు. శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా ప్రతినెల 1వ తేదీనే వేతనాలు అందేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. తమ వేతనాలు రెండు మూడు నెలలు సమయం దాటితే కానీ తమకు అందడం లేదని ఈ విషయాన్ని సమగ్రంగా పరిశీలించి వాటికి తగిన విధి విధానాల్లో మార్పు తీసుకురావాలని అన్నారు. ఆగస్టు నెల జీతం ఇప్పటికీ మంజూరు కాలేదని సెప్టెంబర్ నెల జీతం ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితిలో ఉన్నామన్నారు.

వీధి కుక్కలతో ప్రజల ఇబ్బందులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న వీధి కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదుల సంఖ్యలో కుక్కలు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను రోడ్లమీద తిరగనీయకుండా చేస్తున్నాయి. చిన్నపిల్లల అయితే కుక్కలతో భయభ్రాంతులకు చెందుతున్నారు. ఇళ్ల వద్ద తిరుగుతున్న కుక్కలను తరిమిన వెళ్లడం లేదని మహిళలు వాపోతున్నారు. చేతిలో సంచి కనిపిస్తే కుక్కలన్నీ కలిసి సంచి ఉన్న వ్యక్తిపై తిరగబడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి రోడ్లపై కుక్కలు తిరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతాంగానికి పెట్టుబడి సాయం కింద ప్రకటించిన 20 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించకుండా ఇచ్చిన జీవో నెంబరు 22 రద్దు చేయాలని, కౌలు రైతులకు భూస్వాములతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవాడ ఫ్యాక్టరీ ఏరియా కార్యదర్శి వనము సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు రంగలి ముత్యాల నాయుడు, బొడ్డేడ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

యోగాలో జాతీయ స్థాయి పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు



విశాలాంధ్ర - పాయకరావుపేట: సి.బి.ఎస్.ఈ. బోర్డు వారిచే ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు తమిళనాడులోని శ్రీ గోకులం పబ్లిక్ స్కూల్ నందు నిర్వహించిన సౌత్ జోన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, పాండిచ్చేరి యోగా పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. అండర్ - 17 బాలుర విభాగంలో బి.దేవాన్ష్ నాయుడు, జి.సోమ సూర్య చరణ్, పి.సోహాస్ శ్రీ, సిహెచ్.జయదీప్, వి. చైతన్య ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. దీంతో అక్టోబర్ 2 నుండి 5వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని ఎల్.పి సవాని అకాడమీ నందు జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేతలు సిహెచ్.వి.కె.నరసింహారావు, సిహెచ్. విజయ్ ప్రకాష్, యోగా గురువులు సురేష్, జయంతి తదితరులు అభినందించారు.

రామచంద్రపురంలో మంచినీటికి కటకట

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో లింగంపేట పంచాయతీ రామచంద్రపురం గ్రామంలో గత రెండు రోజులుగా మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. 280 మంది జనాభా గల గ్రామంలో 2017లో మాజీ మంత్రి ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో 5000 లీటర్ల సోలార్ ట్యాంక్ ఏర్పాటు చేయించారని అన్నారు. కానీ గత రెండు రోజుల నుండి వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా ఇబ్బందులు తప్పడం లేదని అలాగే గ్రామంలో ఉన్న మంచినీటి బోర్లు మరమ్మతులకు గురై దర్శనమిస్తున్నాయన్నారు. అందులో ఒక బోరు కొత్తది అయినందున వాటినుండి బురద నీరే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. లింగంపేట పంచాయతీలో పది కోట్ల రూపాయలతో భారీ మంచినీటి ప్రాజెక్టు ఉందని, వాటి ద్వారా మండలంలో సుమారు 15 గ్రామాలకు నీరు అందిస్తున్న తమ గ్రామానికి ఇంటింటి కుళాయి కనెక్షన్లు లేవని తమ గ్రామానికి మంచినీటి సౌకర్యం అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు అన్యాయం చేయొద్దు

విశాలాంధ్ర - నక్కపల్లి: వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించడానికి అమలాపురం పంచాయతీలో గల మూలపర్ర, పాటిమీద గ్రామాలకు తేదీ:29-12-2010ని కటాఫ్ తేదీగా ప్రకటిస్తూ రెవెన్యూ అధికారులు ఆదేశాలు మేరకు గ్రామ సచివాలయం అధికారులు గ్రామ సచివాలయంలో నోటీసులు అంటించి, దీనిపై ఐదు రోజులలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ప్రకటించడం జరిగింది. దీనిపై నిర్వాసితులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. మూలపర్ర గ్రామానికి చెందిన నిర్వాసితులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి ఎప్పుడైతే ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకుంటుందో దానినే కటాఫ్ తేదీగా పరిగణించాలని, అప్పటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారికి ఇరవై ఐదు లక్షలు ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, అమలాపురం గ్రామ ఉపసర్పంచ్ గంటా నర్సింగరావు (గబ్బర్ సింగ్), గురునాథ్, నానాజీ, శ్రీనివాస్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూను అపవిత్రం చేసిన వారికి శిక్ష తప్పదు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన వారికి శిక్ష తప్పదని ఎలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలో అచ్యుతాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డు అపవిత్రం చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 11 రోజుల దీక్షకు మద్దతుగా నియోజకవర్గంలో మండలంలో 3 రోజులు ప్రాయశ్చిత్త దీక్ష చేపడుతు న్నామన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రాయశ్చిత దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. దీక్షకు మద్దతుగా నియోజక వర్గంలో గల అన్ని గ్రామాల్లో ప్రాయశ్చిత దీక్షలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, డ్రీమ్స్ నాయుడు, కూండ్రపు విమలా నాయుడు, దిన్ బాబు, శ్యామ్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నచ్చితే డ్యూటీ...లేకపోతే ఫోన్లలో నిమగ్నం

కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం
సమయపాలన పాటించని వైనం
పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి శివారు బుదిరెడ్లపాలెం గ్రామంలో ఉన్న సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా విధులకు హాజరవుతున్నారు. ఒకవేళ విధులకు వచ్చినా వారికి నచ్చితే డ్యూటీ చేస్తారు లేకపోతే ఫోన్లు పట్టుకొని ఆదుకుంటారు. పంచాయతీ కార్యదర్శి కూడా సచివాలయ సిబ్బంది తీరును పట్టించుకోని పరిస్థితి ఉంది. అడిగే వారు లేరు అనే ధీమాతో మొక్కుబడిగా ప్రతిరోజు ఉదయం 11:00 లేదా 12:00 గంటలకి గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు చేత సచివాలయం తలుపుల తాళాలు తీస్తున్నారని అతను ఒక గంట సేపు కూర్చొని వెళ్ళిపోతు న్నాడని గ్రామస్తులు వాపోతున్నారు. ఒకవేళ సిబ్బంది మాత్రం విధులకు వచ్చినా సరే సచివాలయంలో కాకుండా వేరే చోట వీళ్ళు ఫోన్లు పట్టుకొని ఆడుకుంటున్నారని ఇలా అయితే గ్రామస్తులకు పనులు ఎలా జరుగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో కనీసం పారిశుద్ధ్య పనులు కూడా చేయించడం లేదని గతంలో గ్రామంలో కొంతమంది యువత పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి సచివాలయంలోకి ఎందుకు రాలేదు అని అడిగితే సిగ్నల్ సరిగా రావడం లేదు అని కారణాలు చెప్పే వారని దాంతో గ్రామంలో యువత డబ్బులు కూడగట్టుకొని ఫైబర్ నెట్ వేయించినా సరే సచివాలయ సిబ్బంది పని చేయడానికి సచివాలయం లోపలికి రావడం లేదని వాపోతున్నారు. ఈ విధంగా గ్రామంలో చాలా పనులు చేయిం చుకోవడానికి యువత, వృద్ధులు ఎదురుచూస్తున్నారు అని చెప్పినా సరే వినిపించుకోవడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పలుమార్లు హెచ్చరించినా అధికారులలో ఎటువంటి చలనం లేదని మోటూరు గోవిందా, యేన్నంశెట్టి సన్యాసినాయుడు, మోటూరు బాలాజీ, గండెం చిన్నారి, మేకల సతీష్, పెంటకోట సతీష్, పలువురు వాపోతున్నారు.

రాష్ట్ర ప్రగతి కూటమితోనే సాధ్యం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మునగపాక: మునగపాక మండలం తోటాడ పంచాయతీ త్రిమూర్తులు వారి గుడి వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం అధ్యక్షతన కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం ముగింపు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం వంద రోజుల్లో ఎన్నో నిర్ణయాలు ఎన్నో కార్యక్రమాలు అమలు పరచటం ద్వారా ఈ రాష్ట్ర ప్రగతికి పురోగతికి ఎంతో దోహద పడుతుందని అన్నారు. అచ్యుతాపురం జంక్షన్‌ను అతి సుందరంగా తీర్చిదిద్దడానికి కావలసిన చర్యలను తీసుకోవడం జరిగిందన్నారు. అచ్యుతాపురం చుట్టుపక్కల మండలాలకు అనుగుణంగా ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణ అనుమతులు సాధించామన్నారు. అలాగే అచ్యుతాపురం నందు స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయమ్మ, పోలమరశెట్టి మురళి, దొడ్డి రమేష్, ఆళ్ల వెంకటేష్, ఆడారి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ దాడి శ్రీను, మాజీ సర్పంచ్ దాడి వీర మహాలక్ష్మి నాయుడు, కొర్రపాటి వీర రాజశేఖర్, పోతిన నాగ శివ, మళ్ల రాజేష్, ఆడారి జనా ర్ధన్, ఎల్లపు శ్రావణ్ కుమార్, శరగడం యోగి నాగేశ్వ రరావు, సారిపల్లి ప్రసాద్, బొడ్డేడ రాము, ఎర్ర రాము, సుందరపు కనక అప్పారావు, కరణం సంతోష్ పాల్గొన్నారు.

నేడు బొజ్జన్న కొండ బుద్దిస్ట్ డిస్టినేషన్ లైట్ అండ్ సౌండ్ షో ప్రారంభం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లాలో బొజ్జన్నకొండ బుద్ధిష్ట్ డెస్టినేషన్ లైట్, సౌండ్ షోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర టూరిజం కల్చర్ అండ్ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కందుల దుర్గేష్ చే వర్చువల్‌గా ప్రారంభించబడుతుందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలో బొజ్జన్న కొండ చాలా ఆహ్లాదకరమైన ప్రాంతమని విశిష్టత కలిగి ఉందని, అటువంటి ప్రదేశాన్ని మరింత పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దేందుకు టూరిస్ట్ అమినిటీ సెంటర్, లైట్ అండ్ సౌండ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వం అన్ని విధాలుగా బొజ్జన్న కొండను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన బొజ్జన్న కొండ చుట్టూ అందమైన కొండలతో ఉంటుంది ఆహ్లాదకరమైన వాతావరణం దీని ప్రత్యేకత అన్నారు. దేశంలో అత్యంత విలువైన వారసత్వ నిర్మాణాల్లో నేటికీ చెక్కుచెదరక నిలిచిన ఈ ప్రదేశం ఓ ముఖ్యమైన పర్యాటక గమ్యస్థానం అని తెలిపారు.

ఎంపీడీఓగా జయ ప్రకాష్‌రావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయక రావుపేట ఎంపీడీఓగా ఎ.జయ ప్రకాష్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఎ.సాంబశివరావు కే.కోటపాడు బదిలీ చేశారు. ఆయన స్థానంలో చీడికాడలో పనిచేస్తున్న జయ ప్రకాష్‌రావును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఎంపీడీఓను కలిసి శాలువా, పుష్ప గుచ్చాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవికుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శులు వై.సత్యనారాయణ, జె.నరేష్, జి.శివాజీ, మల్లికార్జున చారి, రామ గోవిందు, హుస్సేన్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

"మహాజన సభ"లో ఫ్యాక్టరీ అభివృద్ధిపై నిర్ణయం తీసుకోవాలి

విశాలాంధ్ర - చోడవరం: ఈ నెల 28న జరగనున్న ది.చోడవరం(గోవాడ) సహకార చక్కెర కర్మాగారం మహాజన సభ సందర్భంగా ఏ.పి.రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం చోడవరంలో జిల్లా కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఏ.పి.రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ 'గోవాడ సుగర్స్‌లో గత ఆరేళ్ల క్రితం వరకు ఏడాదికి 5లక్షల టన్నులకు పైగా క్రషింగ్ చేస్తూ, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేదని తెలిపారు. కానీ, డబ్ల్యుటివో (ప్రపంచ వాణిజ్య సంస్థ) ఆదేశాను సారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో, విదేశాల నుండి ఇబ్బడిముబ్బడిగా పంచదార దిగిమతులు పెంచి, దేశంలో ఉత్పత్తి అవుతున్న పంచదారకు గిట్టుబాటు ధర లేకుండా చేశారన్నారు. గొడౌన్లలో పంచదార నిల్వలు పేరుకుపోయి, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, దీనికి తోడు ఫ్యాక్టరీ పాలక వర్గాలు, అధికార యంత్రాంగాలు కుమ్మక్కై అవినీతి, అక్రమాలకు 'అక్షయపాత్ర'గా ఫ్యాక్టరీలను మార్చడం, ఉప ఉత్పత్తులపై ఫ్యాక్టరీకి ఆర్థిక తోడ్పాటును అందించే యూనిట్లు ఏర్పాటు చేయకపోవటంతో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభంలో పడిందని తెలియజేసారు. రాష్ట్రంలో సహకార రంగ ఫ్యాక్టరీలు మూతబడ్డాయని, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాత్రమే వాటన్నింటినీ తట్టుకుంటూ నిలిచిందని తెలిపారు. రైతుల బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో, పెట్టుబడుల విపరీతంగా పెరిగి, ఫ్యాక్టరీ చెల్లించే మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు క్రమేనా చెరుకు సాగు తగ్గించారన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గత ఏడాది క్రషింగ్ లక్ష 70వేల టన్నులకి ఘోరంగా పడిపోవడమే దీనికి పెద్ద ఉదాహరణ అన్నారు. ఈనెల 28న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభలోగా రైతులకు గత సీజన్ బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు, పిఎఫ్, ఓటీ మొదలైనవి పూర్తి స్థాయిలో చెల్లించాలన్నారు. గత పదేళ్ల కాలంలో టిడిపి, వైసిపి, నేటి కూటమి ప్రభుత్వాలతో సైతం ఎన్నికల సమయంలో ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం అనేక హామీలు ఇచ్చారన్నారు. ఎవరు కాదన్నా ఫ్యాక్టరీ చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి, కానీ ఎన్నికల అనంతరం అవన్నీ నీటి మీద రాతలు గానే మారిపోతున్నాయని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఫ్యాక్టరీలో నెలకొల్పుతామన్న ఇథనాల్ ప్లాంట్/ డిస్టలరీ యూనిట్ నేటికీ కాగితాల పైనే ఉందన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో సుమారు 23,500 మంది సభ్య రైతులు, 1000 మంది కార్మిక కుటుంబాలకు ఉపాధి చూపిస్తున్న ఫ్యాక్టరీ మనుగడ కోసం ఈ మహాజనసభలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బేరా జగదీశ్వరరావు, గొర్లి రాజు, అయితిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

చెరకు ఫ్యాక్టరీపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

విశాలాంధ్ర - కె కోటపాడు: ఈ ప్రాంతానికే తలమానికంగా ఉన్న గోవాడ చక్కెర కర్మగారం రోజురోజుకు తన ఉనికిని కోల్పోతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న చక్కెర కర్మాగారాలన్నింటిలో మొదటి స్థానంలో ఉంటూ లక్షలాది కార్మిక కర్షక కుటుంబాలకు జీవనోపాధి ఇచ్చే గోవాడ చక్కెర ఫ్యాక్టరీ పూర్తిగా నష్టాల బాటలో పయనిస్తోందన్నారు. ఇందుకు ప్రధాన కారణం పాలకుల అవినీతి అని అన్నారు. గతంలో ప్రతి క్రషింగ్ సీజన్లో సుమారు 5 లక్షల టన్నులు గానుగాట జరిపే ఫ్యాక్టరీ నేడు లక్ష టన్నులకు పడిపోయిందంటే రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ఇక్కడ పంచదారకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉండేదని , ప్రస్తుతం దిగుమతులు ఎక్కువ కావడంతో ధరలు పతనం అయ్యాయని అన్నారు. దీంతో ఉత్పత్తి వ్యయం కూడా రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది అప్పులు చేసి రైతులకు పేమెంట్లు చేసే దుస్థితికి పాలకవర్గాలు దిగజార్చేయన్నారు. బకాయిలు సక్రమంగా చెల్లించకపోవడం , రైతులకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వలేకపోవడం, ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు సాగు ప్రోత్సహించ కపోవడంతో ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు గణనీయంగా తగ్గిపోయింది అన్నారు. సహకార రంగంలో ఉన్న ఫ్యాక్టరీకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకువస్తామని గత ఎన్నికల ముందు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్థానిక ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చారని , ప్రస్తుతం ఫ్యాక్టరీ పై ఆధారపడి జీవిస్తున్న 1000 మంది కార్మికులు 24 వేల మంది రైతు కుటుంబాలు నాయకుల సహకారం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. 2013 - 14 సీజన్ లో 5.51 లక్షల టన్నుల చెరుకు గానుగాట ఆడగా 9.5% రికవరీ సాధించింది అన్నారు. అలాంటి ఫ్యాక్టరీ ఇప్పుడు లక్ష టన్నులు ఆడుతుందా లేదా అన్న అనుమానం కలుగుతుంది అన్నారు. రైతులకు చెరకు మద్దతు ధర ఇవ్వలేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో సతమతవుతోంది అన్నారు. ఈనెల 28న జరుగు మహాజన సభలో చెరకు మద్దతు ధర కోసం ఫ్యాక్టరీ ఆధునీకరణ కోసం నాయకులను రైతులు ప్రశ్నించాలని కోరారు. ప్రస్తుతం 9 కోట్ల రూపాయలు ఉంటేనే రైతులకు మిగిలిన బకాయిలు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు . కూటమి నాయకులు ఫ్యాక్టరీ పై మొసలి కన్నీరు కార్చకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వెంకట్ నగర్ కాలనీలో భారీ అన్నసమారాధన

విశాలాంధ్ర - నక్కపల్లి: మండల కేంద్రంలో సిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవం సందర్భంగా స్థానిక వెంకట్ నగర్ కాలనీలో గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. సిద్ధి వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో సుమారుగా 4000 మంది భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సామాజిక కార్యకర్త నవర నూకరాజు శర్మను టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ సమక్షంలో కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర - నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న

మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమాన్ని ఈనెల 28వ తేదీన అన్ని గ్రామాల్లో పూర్తి చేసే విషయంలో ప్రతి ఒక్క ఉద్యోగి చర్యలు తీసుకోవాలని ఎంపిడివో దెందుకూరు సీతారామరాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం అయిన తర్వాత సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నరేష్, వేమగిరి నూకరాజు, ఏపిఎం, ఏపీవోలు శ్రీవిద్య, భాగ్యవతి, ఐసిడిఎస్ పిఓ, హౌసింగ్ అధికారి జగన్ తదితరులు ఉన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - గొలుగొండ: బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు రిమాండ్‌కి తరలించడం జరిగిందని కృష్ణదేవి పేట ఎస్ఐ టి.దివ్య తెలిపారు. ఏఎల్ పురం గ్రామంలో కొంగసింగ జంక్షన్‌లో ఏడు మద్యం బాటిల్స్ తరలిస్తున్న చోద్యం గ్రామానికి చెందిన చింతల రమణ (65) అని వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై టి.దివ్య మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహణ నాటు సారా క్రయ విక్రయాలకు పాల్పడిన గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా, నిల్వలు ఉన్నట్లయితే ముందస్తుగా కృష్ణ దేవి పేట పోలీసులకు సమాచారం అందివ్వాలని ఎస్సై ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడకూడదని ఎవరైనా పాల్పడినట్లైతే అలాంటి వ్యక్తులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలియజేశారు.

జగన్ ప్రాయశ్చిత్తం చేసుకోవడం ఉత్తమం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పులివెందుల శాసనసభ్యులు జగన్ మోహన్ రెడ్డి ప్రాయశ్చిత్తం చేసుకోవాలనే నిర్ణయం చాలా మంచిదని, చాలా ఉత్తమమని బిజెపి నాయకులు వీరన్న చౌదరి అన్నారు. జగన్ చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కొంత మినహాయింపు ఇస్తుందన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అయితే జగన్ మోహన్ రెడ్డి

నమ్మకం లేని వేంకటేశ్వర స్వామి వారి సమక్షంలో కాకుండా, వారు నమ్మి ప్రార్థించే ప్రభువు సన్నిధిలో ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. తిరుమలలోనే చెయ్యాలని నిర్ణయించుకుంటే, వారు సతీ సమేతంగా "వేంకటేశ్వర స్వామి వారి మీద భక్తి విశ్వాసాలు ఉన్నవి" అని అంగీకరిస్తూ సంబంధించిన పత్రాల మీద ఇరువురూ సంతకం చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలని స్వామి వారి సమక్షంలో, భక్తులకి సంతృప్తి కలిగే విధంగా స్వీకరించాలన్నారు. ఒక సాధారణ హిందువుగా నా మనవి చేస్తున్నానన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - గొలుగొండ: శ్రీ సత్య సాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో మండలంలో 8, 9, 10, ఇంటర్ విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా ఇన్చార్జ్ దుల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం శ్రీనివాసులు పత్రిక ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ పాఠశాలలో ఇంటర్ కాలేజీలలో విద్యార్థి విద్యార్థులకు తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు దైవం పట్ల భక్తి పెంపొందించేందుకు విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. మండలంలో ఉన్న పాఠశాలలో కాలసాలలో అనేక చోట్ల నేడు ఈ వ్యాచరస పోటీలు శ్రీ సత్య సాయి సేవా సంస్థలు సభ్యులు వాలంటీర్లుగా వెళ్లి నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొంగ సింగి భజన మండలి కన్వీనర్ సత్యనారాయణ. జీవీ రమణ. సమితి కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎసెన్షియా ఫార్మాలో హైలెవెల్ కమిటీ పరిశీలన

అందరి సహకారం భాగస్వామ్యంతోనే పరిశ్రమలలో ప్రమాదాల నివారణ సాధ్యం

హై లెవెల్ కమిటీ ఛైర్ పర్సన్ వసుధా మిశ్రా

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో గురువారం హై లెవెల్ కమిటీ పర్యటించింది. ప్రమాద ఘటనాస్థలిని, పరవాడ ఫార్మాసిటీ లోని సినర్జీన్ యాక్టివ్ ఇన్గ్రేడియంట్స్ సంస్థ, యూనిట్-3 లో జరిగిన ప్రమాద స్థలిని ప్రభుత్వం నియమించిన హై లెవెల్ కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు, హై లెవెల్ కమిటీ సభ్యులకు ప్రమాదం జరిగిన తీరును, కారణాలను కంపెనీ ప్రతినిధులు వివరించారు. మొదటగా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటనాస్థలిని పరిశీలించి అనంతరం లారస్ ల్యాబ్స్ యూనిట్-2లో ఉన్న సమావేశ మందిరంలో వివిధ విభాగాల ఉన్నత అధికారులు, ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమావేశం లో ప్రమాదంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదానికి గల కారణాలను, చోటుచేసుకున్న వైఫల్యాలను అధికారులు శాఖల వారీగా వివరించారు. అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై వారి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హై లెవెల్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి వసుదా మిశ్రా మాట్లాడుతూ. అందరి సూచనలు, సలహాలు స్వీకరించటానికి ఈమెయిల్ ఐడి, వాటప్ప్ గ్రూప్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కమిటీ కన్వీనర్ కు ఆదేశించారు. కమిటీ రిపోర్టులో మంచి సూచనలను తప్పకుండా పొందుపరుస్తామని తెలియజేశారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు అందరి సహకారం, నిర్ణీత పరీక్షల నిర్వాహనలో భాగస్వామ్యం అవసరమని, అప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమని అన్నారు. రెండవ పూట పరవాడ ఫార్మాసిటీ లోని సినర్జీన్ యాక్టివ్ ఇన్గ్రేడియంట్స్ సంస్థ, యూనిట్-3 లో జరిగిన ప్రమాద స్థలిని పరిశీలించి అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో విశాఖ ఫార్మా లిమిటెడ్ సమావేశం మందిరంలో సమావేశమై వారి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ .పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు అందరి సహకారం అవసరమని, దానికై విలువైన సూచనలు సలహాలు ఇవ్వటానికి ముందుకు రావాలని కోరారు. పరిశ్రమల పరిరక్షణకు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నుండి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హై లెవెల్ కమిటీ కన్వీనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ, ఎవి పటేల్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బోయిలర్స్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ రాఘవన్ (ఐఐటి చెన్నై), ఆర్డీవో చిన్నికృష్ణ, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ హరి ప్రసాద్, జీఎం ఇండస్ట్రీస్ శ్రీధర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

80వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి

కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించిన కార్పొరేటర్ నీలిమ భాస్కర్

విశాలాంధ్ర - అనకాపల్లి: 80వ వార్డులో సమస్యలపై కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ రెండో రోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. అంతేకాకుండా మేయర్‌కు, కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఇదిలా ఉండగా జీరో ఆవర్లో ఆమె మాట్లాడుతూ సంతబయల్లోమంజూరైన 1000 కేఎల్ వాటర్ ట్యాంక్ ని టెండర్ అయినా గాని పనులు ప్రారంభించలేదని, నూకాంబిక అమ్మవారి గుడి రోడ్డుకి ఇరువైపులా కాలువల నిర్మాణం, సుంకరమెట్ట నుండి జలగల మధుము కి వెళ్లే రోడ్లో రోడ్డు పూర్తిస్థాయిలో గుంతలు పడి ఆ మార్గం ద్వారా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వెంటనే ఆ రోడ్డు పనుల్ని పూర్తిచేయాలని కోరారు. వార్డులో ఉన్న ఇరిగేషన్ కాలువలను జీవీఎంసీ కాలువలను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి కాలువల కప్పీయడం జరుగుతుంది. కావున కోట్లు విలువచేసే జీవీఎంసీ స్థలాలను కాపాడాలని, ఎరుకువాణి పాలెంలో ఉన్న బరియల గ్రౌండ్‌కి కాంపౌండ్ వాల్, మౌలిక వసతులు కల్పించాలని, సాయి బృందావన కాలనీలో రోడ్స్ నిర్మించాలని, బైపాస్ ఆంజనేయ స్వామి వారి గుడి దగ్గర నుండి తోటాడ బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మించాలని, గౌరీ కాలనీ నుండి తోటాడ వెళ్లే రోడ్డు నిర్మించాలని, ఎన్టీఆర్ కాలనీ, గోపాలకృష్ణ థియేటర్ పక్కన ఉన్న రోడ్డు, గొర్లివాని పాలెం వల్లూరు లో పలుచోట్ల రోడ్లు నిర్మించాలని కోరారు.అంబేద్కర్ నగర్లో ఉన్న అంబేద్కర్ సామాజిక భవనం శిథిలావస్థకి చేరుకుందని దానిని తొలగించి కొత్తగా రెండు ఫ్లోర్లు నిర్మించాలని,రజకుల కాలనీలో ఉన్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుందని దానిని పూర్తిగా తొలగించి కొత్తగా రెండు ఫ్లోర్లు రజక సామాజిక భవనం నిర్మించాల్సిందని అన్నారు.ఈ పనులను వీలైనంత తొందరలో పూర్తి చేయిస్తామని మేయర్, కమిషనర్ హామీ ఇచ్చినట్లు నీలిమ భాస్కర్ తెలిపారు.

దుకాణాలలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు

విశాలాంధ్ర - రావికమతం: మండల కేంద్రంలో దుకాణాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను గురువారం నుంచి అమర్చుతున్నారు. ముంబాయికి చెందిన అదాని ఎలక్ట్రిక్ సిటీ సిబ్బంది దుకాణలలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లు తొలగించి వాటి స్థానంలో అదాని కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు. కొత్తగా మీటర్లను అమర్చే సిబ్బంది వద్ద ఎటువంటి ఐడి ప్రూఫ్ లేకపోవడంతో కొంతమంది దుకాణదారులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు నిరాకరిస్తున్నారు. ఈ విషయమై మండల అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ నందన్ వివరణ కోరగా విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకే కేటగిరి 2 కు చెందిన ప్రస్తుతం ఉన్న మీటర్లను తొలగించి కొత్తగా స్మార్ట్ మీటర్లు ను అమర్చుతున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎటువంటి అపోహలకు గురి కావద్దని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వలన ఏ సమయంలో విద్యుత్తు ఎక్కువగా వినియోగం అవుతుంది తెలుసుకునే వీలుంటుందని ఏఈ నందన్ తెలిపారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో అదనపు విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. విద్యుత్ శాఖ ఖర్చులు తగ్గించుకునేందుకే ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నెలవారి వినియోగపు బిల్లింగ్ విధానం స్థానంలో వినియోగదారుడు ముందుగా కొంత మొత్తాన్ని విద్యుత్ శాఖకు మొబైల్ యాప్ ద్వారా రీఛార్జ్ చేయడం ద్వారా విద్యుత్ సరఫరాకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని వినియోగదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిత

విశాలాంధ్ర - అనకాపల్లి: స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కాలేజీలో గురువారం ఫారడే మెమోరియల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్. డి.రామ్ ప్రసాద్ విచ్చేసి విద్యార్థుల సాంకేతిక పరిశోధనల సమాహారంగా "ఇన్నోవేటివ్ ఐడియాస్ 23 - 24" పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ద్వారా మాత్రమే విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందగలరని తెలిపారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గోపాలమ్మ మాట్లాడుతూ .మైకేల్ ఫారడే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగానికి చేసిన కృషిని వివరించారు. విద్యార్థులు డైట్ రీసెర్చ్ అండ్ అవుట్ రీచ్ ప్రోగ్రాం ద్వారా చేసిన పరిశోధనల గురించి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠ రావు మాట్లాడుతూ. విద్యార్థులు నిరంతరం అధ్యయనం చేస్తూ ఉండాలని శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను గమనించాలని తెలిపారు. సాంకేతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ రాంప్రసాద్ విద్యార్థులకు

ఇండస్ట్రీలో ఎలక్ట్రిసిటీ ప్రాముఖ్యతను, భద్రత గురించి గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ విభా గాధిపతులు అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.